నగరం తన నిద్రమత్తు వదిలించుకోవని వారాం చేస్తోంది. నాగరికత ముసుగు చాటున పరువు ప్రాపకాల కోసం ఫాల్స్ ప్రిస్టేజితో బ్రతకవలసిన వాళ్ళు ఆపాటికే లేచి ఆవురావురుమంటూ ఆ పనీ, ఈ పనీ ముగించేసుకుంటున్నారు. సిటీలో సూర్యుడు కూడా సింపుల్‌గా ఉండడు. పొద్దు పొడిపించా ననిపించాడు. అది ఫాల్స్ ప్రిస్టేజి ముఖమో, కాదో పని గట్టుకుని పసిగట్టే తీరిక, ఓపిక మీకూ, నాకూ ఎక్కడివి?

నిరంజన్‌కి ఉన్నాయి. నయాపూల్ మీద నిలబడి తలకు చుట్టుకున్న మఫ్లర్ ఊడదీస్తూ చుట్టూ చూశాడు. తనేమైనా ఆలస్యం చేశానా అనుకుంటూ స్కెచ్ బుక్ తీశాడు.

ఓ వైపు సాలార్‌జంగ్ మ్యూజియం. ఎడమవేపున దిగువలో అఫజల్‌గంజ్‌లో ఆగిన రెండు ఆకుపచ్చ బస్సులు, ఇంకో డబుల్ డెక్కర్. అక్కడ పలచగా మనుష్యులు. బస్ స్టాప్ వేపు కివతల పార్కు. పార్కులో నీటి పంపు దగ్గర గోచీ బిగించి ఏదో బాగుచేస్తున్న తోటమాలి. ఆశ్రయం లేక అస్తవ్యస్తంగా పచ్చి గడ్డి మీద ఎడాపెడగా పడుకుని నిద్దరోతున్న వ్యక్తులు నలుగు రైదుగురు. మూసీ ముసిముసిగా, అభిసారికలా పరుగెడుతున్న వైనం. కుడిచేతివైపుగా వెనక్కి తిరిగి చూస్తే ఆ రాత్రి జరిగిన అన్యాయాలకు తను ఎప్పుడో ఒకప్పుడు సాక్ష్యం చెప్పించవలసి వస్తుందనే బెంగతో శ్వాసం తప్పకుండా ముడుక్కున్న కోర్టు.

ఈ వెనకగా తెలియని అనారోగ్యానికి ప్రకృతి చికిత్సాలయంలో కోలుకుంటున్న అమ్మాయిలా కూర్చున్న ఉస్మానియా ఆసుపత్రి.

మఫ్లర్‌తో నడుం కట్టు కట్టి, తనకు నచ్చిన స్టిల్‌ని ఎన్నుకుని చకచకా గీసుకుంటున్న నిరంజనం ఎక్కడినుంచో జోగుతూ వస్తున్న నీలిరంగు డిస్ట్రిక్ట్ బస్ దృశ్యానికి అడ్డం రాగా డిస్టర్బ్ అయ్యాడు. అలా అవతలివేపు ఫుట్‌పాత్‌ని పరికించాడు.

తన భవిష్యత్తు మీద అంత పెద్ద నమ్మకమున్న చిలక జోస్యంగా డెవడో ఆ పాటికే పంజరంతో తయారై ఉత్తరీయంతో ఫుట్‌పాత్ మీద దుమ్మని ఊడ్చుకుంటున్నాడు. అది అయాక ఒద్దికగా కూర్చుని, అలవాటుగా నేలమీద చేతితో తాకి కళ్ళకద్దుకున్నాడు. మరో సారి తాకి పంజరంలోని చిలక ముఖంవేపు అద్దాడు. తలగుడ్డ విదిలించి మరలా ఉత్తరీయంలా వేసుకుని, బీడీ వెలిగించాడు.

నిరంజన్ ఇంకో పేజీ తిప్పి పెన్సిల్‌ని టకటకా ఆడించేస్తూ అప్పటికప్పుడే అతన్ని స్కెచ్‌లో ఇమడ్చడానికి ప్రయత్నిస్తున్నాడు. పరికరాలన్నీ వేసి, జోస్యం వ్యక్తి ముఖ కవళికల నెలా వెయ్యాలా అని అతని వేపు చూశాడు.

ఆ దృశ్యం చూసి మరింత ఆశ్చర్యపోయాడు.

అవును. ఆస్పత్రి నుంచి వస్తున్న ఆ నర్సుని తను గమనిస్తూనే ఉన్నాడు. అరె! అతనితో ఏదో మాట్లాడుతూంది. సన్నగా ఉంది. ఫ్రెష్‌గా ఉదయంలానే ఉంది. మాట్లాడుతున్న ఆ నర్స్ నడుం మీదున్న ఎడంచేతిని తీసి వాచీ చూసుకుని అటూ ఇటూ చూసి రూపీని వంగి వాడి దగ్గరే కూర్చుంది.

యూనిఫారంలో ఇంకా ఇరవై నిండని ఆ అమ్మాయికి అంత ఉదయాన చిలక జోస్యంతో పనేమిటో, తనని కలవర పెట్టే ప్రశ్నేమిటో నిరంజన్‌కి అర్థం కాలేదు. అతని రంగుల మనసు ఆమె చుట్టూ వింతదృశ్యాలను గీస్తూ నంటూంది.

ఏమై ఉంటుంది? !

నిరంజన్ ఆలోచిస్తున్నాడు. అదివరకు తను నర్సుల్ని గురించి విన్న కథలలో ఆ కూర్చున్న అమ్మాయి కారెక్టర్ ఎక్కడుందో వెతుకుతున్నాడు.

నర్సుల్ని గురించి వినివాడు, ఏదో ఒక చిట్కా వైద్యం తెలియని వాడు ఉండడు.

ది నర్సెస్- ది ఆర్ ఆఫ్ ది సేవ్ స్టఫ్. కదలించావూ కావిలించుకుంటా నన్నట్టు చూస్తారట. మాట కలిపితే చాలు—తిరుగు టపాలో తన కార్యక్రమాలన్నీ వివరిస్తూ తన కెలా ఉత్తరం వ్రాయవలసిందీ, ఎక్కడ కలుసుకోవలసిందీ వ్రాసి 'విత్ కిసెస్' అని ముగిస్తారట. వాళ్ళు కోపగించుకున్నా దానిలో ఓ చెన్ను రొమాంటిక్ డోసు ఉంటుందట. వాళ్ళతో చాలా జాగ్రత్తగా ఉండాలట. ఎవడైనా అందంగా కనిపిస్తే, అథవా డబ్బున్నట్టు తెలిస్తే ట్రాప్‌లోకి లాగుతారట.

అంత ఉదయాన ఆత్రంగా కూర్చుని అతన్ని జోస్యం వేసి అడిగించదగ్గ ఆ కోరిక ఏమిటో?

డాక్టర్‌తో తన రొమాన్స్ సఫలం కావాలనా?

పోటీకొస్తున్న లేడీ డాక్టరుకి ట్రాన్స్‌ఫర్ రావాలనా?

తన మనసుని వలపు మాత్రల్లో మింగి మరి ఆ ప్రాంతాల్లో కనపడని పేషెంటు ప్రియుడు ఎక్కడున్నాడో నన్నా? లేక సదరు ప్రియుడికి ఈ జోస్యం గాడితోనే రాయబారం పంపుతూందా?

నిరంజన్ ఆలోచిస్తూనే ఆ అమ్మాయిని స్కెచ్‌లోకి దించేశాడు. ఆర్ట్స్ కాలేజీలో దీన్నో క్విజ్‌గా వేసి అమ్మాయిలందర్నీ ఏడిపించే ప్రయత్నాన్ని ఊహిస్తూ నవ్వుకున్నాడు.

ఆ అమ్మాయి లేచింది. ముడతలు సుతారంగా సవరించుకుంటూ, మళ్ళీ టైమ్ చూసుకుంది. ఆస్పత్రి వార్డులోలాగే అందంగా నడుచుకుంటూ వెళ్ళింది.

నిరంజన్ స్కెచ్ పెన్సిలు గెలకడం ఆపేసింది. పోతున్న ఆ అమ్మాయిని, స్కెచ్‌ని మార్చి మార్చి చూశాడు. అలపోకగా కూర్చుని జోస్యంగాడితో మాట్లాడుతున్న స్కెచ్‌లోని నర్సుకి, అందంగా నడుచుకుంటూ పోతున్న నర్స్‌కి ఏదో తేడా కనిపించింది.

మళ్ళీ పరికించి చూస్తే అర్థమైంది. కూర్చున్నప్పుడు నర్స్ దగ్గర ఓ చిన్న గొడుగు ఉంది. వెళుతున్నప్పుడు అది చేతుల్లో లేదు. గబుక్కున జోస్యం చెప్పే వ్యక్తి వేపు చూశాడు. అటూ ఇటూ చూస్తూ వాడు ఆ లేడీస్ అంబరిల్లాని తీసి జాగ్రత్తగా తన వెనక పెట్టుకున్నాడు. ఆపాటికే నర్స్ మెటర్నిటీ హాస్పిటల్ రోడ్డు ముఖం తిరిగింది.

అంతవరకూ జోస్యంగాడి మీదున్న సానుభూతి, అభిమానం ఆ చర్యతో తుడుచుకు పోయాయి. ఆ అమ్మాయిని పిలిచి గొడుగు తిరిగి ఇవ్వకుండా తనవెనకే దాచుకున్న వైనం — వాడంటే ఓ ఏహ్యభావం తెచ్చింది.

ఇలాంటి దొంగబుద్ధులున్న వాళ్ళా జోస్యం చెప్పేది? లాగి లెంపలేసెరి అనుకున్నాడు.

కాదు. ఆ అమ్మాయి వాణ్ణి ఏం ప్రశ్న వేసిందో తెలుసుకోవాలి.

రోడ్డు క్రాస్ చేశాడు.

"ఎంత తీసుకుంటావ్?"

"రండి. ఫలితం తృప్తిగా ఉంటే మీకు తోచినంత ఇవ్వండి. కూర్చోండి."

"ఆ నర్స్ ఎంత ఇచ్చిందేమిటి?"

"అమ్మాయిలతో మీ కెందుకు? రండి — మీదే మొదటి హస్తం. మీదే మొదటి ప్రశ్న. రండి, కూర్చోండి. సావధానంగా వినండి."

నిరంజనం కూర్చున్నాడు. అలా కూర్చోవడానికి సిగ్గుపడుతూ అటూ ఇటూ చూసి, వంగి రహస్యంగా అడిగాడు:

"ఆ అమ్మాయి ఏమ్మని అడిగింది?"

ముఖంలో విసుగు తెచ్చుకుంటూ అన్నాడు: "అలా చెపితే నాకు హస్తాలు రావు. అది వృత్తి ధర్మం కాదు."

నిరంజన్‌కి కోపం వచ్చింది. వెనక్కి వెళ్ళి జోస్యం వ్యక్తి దాచిపెట్టుకున్న గొడుగుని ఒక్క లాగు లాగాడు.

"నీ వృత్తి ధర్మం ఇదా... ఇడియట్!"

వాడికి కూడా విపరీతంగా కోపం వచ్చిందేమో ఉడికిపోయాడు. అమాంతం లేచి, "ఎవర్రా నువ్వు, భడవకానా!" అంటూ చెయ్యెత్తాడు.

నిరంజన్ ఎర్రటి ముఖం మరింత ఎర్రబడింది. స్కెచ్‌బుక్‌తో అతని ముఖంమీద ఫెడేల్‌మని కొట్టాడు.

జోస్యంవ్యక్తి దెబ్బిపోయాడు. పంజరం చేత్తో పుచ్చుకుని కొట్టబోయాడు.

చిలక కేర్ కేర్ మని అరవడం మొదలెట్టింది.



చుట్టూ జనం చేరారు. వాళ్ళలో ఓ పోలీసు కూడా ఉన్నాడు. "క్యా హువా" అంటూ దూసుకు వచ్చాడు.

జోస్యం వ్యక్తి వగరుస్తూ చెప్పాడు. "దేఖో, సాబ్ ... అనవసరంగా అదీ ఇదీ అడుగుతున్నాడు. నా మీద కొట్టడానికి చెయ్యెత్తుతాడా ... వీడెంత ... వీడి వయసెంత భడవకానా ..."

"క్యా హై, మిస్టర్?" పోలీసు నొసలు విసిరాయి.

"ఫిలో ఈజ్ ఎ థీవ్. టేక్ హిమ్ టు స్టేషన్."

"నీ ఇంగ్లీసు అర్థం కాదనుకుంటున్నావా... రాస్కెల్! రేయ్, భడవా... నీ అంతు చూస్తాను...చూడండి, సార్!" జనంవేపు తిరిగి, "ఆ గొడుగు వాడిదే" అని కింద దూరంగా ఉన్న గొడుగుని లాక్కోబోయాడు.

నిరంజన్ దాన్ని కాలితో తొక్కి పట్టాడు.

"క్యా దేఖ్‌తేహో ... లేజావో ఇస్‌కో."

పోలీసు చాయ్ నీళ్ళు ఊహిస్తూ పెదాలు తడుపుకుని పెన్సిలు, పాకెట్ బుక్ తీశాడు. నిరంజన్‌ని ఎగాదిగా చూస్తూ, "మగర్ ... ఆప్‌కా.." అన్నాడు.

"ఓ అమ్మాయి దగ్గర్నుంచి తీసుకొని ఈ గొడుగు దాస్తుంటే చూశాను. నిజం చెప్పమంటుంటే వినడం లేదు. ఇడియట్‌ని తీసుకెళ్ళి నాలుగు తన్నండి."

పోలీసు సైకిలుని ఎడంగా స్టాండ్ వేసి నిలబడ్డాడు.

"ఆప్ కా నామ్?"

చెప్పాడు.

ఉర్దూలో వ్రాసుకుంటున్న పోలీసు ఇంగ్లీషులో అడిగాడు.

"ఫాదర్స్ నేమ్..."

"మాధవరావు జయంతి. డెప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్."

అంతే! పోలీసువాడు ఠకీమని అటెన్షన్‌లోకి రావడమేమిటి, "మాఫ్ కర్నా, సాబ్" అని గొణగడమేమిటి, జోస్యంగాడిని, వాడి పంజరాన్ని ఒడిసి పట్టి లాక్కుపోతూ అక్కడ చేరిన జనాన్ని వెళ్ళిపొమ్మని కేక వేయడం ... అంతా వెంటవెంటనే జరిగాయి.

నిరంజన్ కిందనున్న గొడుగుని చూశాడు. చుట్టూ కలయ చూశాడు. మూడ్ అంతా పాడయినందుకు విసుక్కున్నాడు. ఆ పాటికే ఓ సారి వేసిన స్కెచ్‌ని చూసి మళ్ళీ మూడ్ తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు. వరసగా చూస్తూ, తను చివర వేసిన పేజీ దగ్గర ఆగిపోయాడు.

జోస్యం వ్యక్తిని ఆ నర్స్ ఏదో అడుగుతున్న స్కెచ్. చాలా బాగా వేయగలిగాడు. కానీ, నర్స్ అతన్ని అడుగుతున్న



– ఎమ్మెస్సార్ మూర్తి

ప్రశ్నేమిటో తెలుసుకోవాలన్న కుతూహలం అతనిలో ఎక్కువైంది.

ఎలా తెలుసుకోవడం?

గుబుక్కున గొడుగు తీసి హేండిల్‌ని చూశాడు.

నో వేవ్. విప్పి చూశాడు.

ఓ అరలో రోజా రంగు దారంతో కుట్టిన ఎస్. ఎల్. అన్న పొడి అక్షరాలు కనిపించాయి. ఏదో ఆలోచన వచ్చిన వాడిలా రకీమని ముడిచి మెటర్నిటీ హాస్పిటల్ వేపు దారి తీశాడు.

* * *

సుమలత మనసు ఆ రోజేమీ బాగా లేదు. క్రితం రాత్రంతా నిద్రలేకపోయింది. 'పాపం! తనంటే కనీసం ఆ చిలక్కయినా జామ్ముక్క వెళ్ళేటప్పుడు దానికి సిద్ధంగా పెట్టి వెళ్ళాలి. ఉంటుందో, ఉండదో? ఉస్మానియాకి ట్రిప్ పడితే వాన్ ఆపు చేయించయినా ఇవ్వాలి.'

ఆరో బెడ్ మేడమ్‌గారికి ఆపిల్ పళ్ళు వచ్చాయో, లేవోనని మునిగాళ్ళ మీద నిలబడి చూసింది.

తోటి పిలుస్తూంది— "మీ కోసం ఎవరో వచ్చా" రని.

మేడమ్ మనోరమగారు విన్నట్టు లేదు. సుమలత చిలకలా పలికింది. "మేడమ్! మీ ఆపిల్స్ ఇంకా రాలేదా? కానీ, నాకోసం ఎవరో వచ్చారట. ఆపిల్స్ టయిందే ... నాకు ..."

తోటి పగలబడి నవ్వుతూంది. "కాదు, సిస్టరమ్మా, మీకోసమే!"

'ఎవరబ్బా' అనుకుంటూ సుమలత మరోసారి తన కంపార్ట్‌మెంట్లోకి వెళ్ళి అద్దం చూసుకుని, అయిదో బెడ్ అడిగిన కాటన్ ఇచ్చి బయటపడింది.

అతను!

లత నెవరో ... ఇదివరకెప్పుడూ చూడలేదే ... ఎర్రగానే ఉన్నాడుగానీ, మరీ అంత ఎరుపా! ఉంగరాల జుత్తు. వలలాంటి తెల్లటి టెరిలిన్ బనియన్, చేతులవే. కండలు తిరక్కపోయినా, షేప్‌ని పుంజుకుంటున్నాయి. బ్లాక్ డయల్ రిస్ట్ వాచి. గ్రీన్ పాంట్. చేతిలో పొడవాటి పుస్తకం. పొడవాటి వేళ్ళు. పెద్ద హీరోలా వడుంకట్టు.

మళ్ళీ నిదానించి చూస్తే నవ్వు ముంచుకొచ్చింది.

అదేమిటో అవతారం! సర్వర్లా చెవి మీద ఎర్ర పిన్నులు! సుమలత నవ్వకుండా ఉండలేకపోయింది.

నిరంజన్ చూశాడు. నవ్వుతున్నప్పటి వింపీ చూస్తూనే ఉన్నాడు. అందం రాను రాను మెరుగు పడింది. మరీ అంత నలుపు కాదు. పెట్టుకున్న రిస్ట్ వాచీ చాలా పాతది.

తను ఇంతవరకూ విరిగి ఉన్న ఆరిస్టోక్రాట్ అమ్మాయిలందర్నీ దృష్టి మీదికి లాగి మిస్ ఎస్. ఎల్. తో పోల్చి చూస్తున్నాడు.

ఈ అమ్మాయితో పోల్చి చూస్తే తన క్లాసులోని ఆడపిల్లలు పేషెంట్సు, వాళ్ళు మిస్ ఎస్. ఎల్. పక్కకి నిరంజన్ మనసులో వచ్చి ఊరుకున్నారు.

సుమలత తనని అతను పలకరించక పోయేసరికి తనే— "ఎవరండీ?" అంది.

నిరంజన్‌కి తను నిలబడి ఉన్నానని అప్పటికిగాని తెలియలేదు.

పాదసర్ఫంగా వచ్చిన ఉపాహా, అలవాటులో లేమని కూర్చున్నాడు.

మళ్ళీ నవ్వింది లత.

నెమ్మదిగా తనూ ఓ చిరునవ్వు చూపించి, "మిస్ ఎస్. ఎల్. మీరేనా?" అన్నాడు.

ఊఁ అన్నట్టు తల ఊపింది.

"అలా బయటికి వస్తారా?"

ఆ రోజు తనకి ఓ. పి. డ్యూటీ. ఇంకా రిజిస్టర్స్ సరంజామా అంతా తీసుకో లేదు. వాచీ చూసుకుని, "పదండి" అంది.

అతను గర్వంగా, హుందాగా నడుస్తుంటే తనని తెలియని ఓ ఆనందం నిలబడ్డా ఈయన అని ఆలోచిస్తూ నడుస్తూంది.

కాంటీన్‌దాకా వచ్చారు.

ఉమెన్ సర్వర్స్ సుమలతని విష్ చేశారు. అతన్ని ఎగాదిగా చూస్తూ నొసలు ఎగరేశారు.

నిరంజన్ కొంచెం ఇబ్బందిగా ఫీలయ్యాడు. కూర్చున్నాడు. సుమలత కూర్చోకుండానే, రెండు చేతులతో ఎడం చెవి రింగుని అసహనంగా సరిచేసుకుంటూ ఓరకంట చూస్తూ అంది: "సారీ ... మిమ్మల్ని పోల్చుకోలేకపోతున్నాను. టీ తీసుకుంటారా ... ఇంకేదైనా."

అలాంటి స్టైల్ పోతే రాదని నిరంజన్ మనసు వేధిస్తూంది. అతి బలవంతాన ఇన్‌స్టింక్ట్స్‌ని ఆపుకున్నాడు.

"కూర్చోండి" అన్నాడు.

కూర్చుంది లత, అతని ఎదురుగానే.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది అతనికి. సుమలత అందాలని చూస్తూ ఆమె గొడుగు ఇవ్వడం అసలు మరిచేపోయాడు. దాన్ని విజిటర్స్ రూమ్‌లోనే వదిలేశాడు. నవ్వుకున్నాడు. "అయామ్ సారీ ... మీ కోసం తెచ్చింది ఆ విజిటర్స్ రూమ్‌లో మరిచిపోయాను."

"ఏం తెచ్చారు?" అతి చనువుగా అడిగింది.

లేవబోయాడు.

## అనుభవం

చేసే తప్పులకు, పడే బాధలకు మనిషి ముద్దుగా పెట్టుకున్న పేరు 'అనుభవం' ... అనుభవాలతో తల పండడం అంటే ఎక్కువ తప్పులు చేసి, ఎక్కువ బాధలు అనుభవించడం అని లోక వ్యవహారం.

—[illegible]

"ఫర్వాలేదు కూర్చోండి. తెప్పిస్తాను" అని అక్కడున్న సర్వరమ్మని పిలిచి, "అయ్యగారు విజిటర్స్ రూమ్‌లో ఏదో మరిచిపోయారట. పట్టుకురా వేగిరం" అని పంపించింది.

"ఈ లోపల ఇవి చూస్తూండండి." సుమలత ముందుకి స్కెచ్ బుక్‌ని నెట్టాడు.

సుమలత ఒక్కొక్క పేజీ చూస్తూ నిరంజన్ ముఖంలోకి చూస్తూంది.

తనకు తెలియని వ్యక్తి తన బొమ్మలు చూసి ఎంత సంతోషపడుతుందో మొదటిసారిగా పరిశీలిస్తున్న నిరంజన్ మనసు ఏకలు వేస్తూంది.

చివరి స్కెచ్ వచ్చింది.

చిలక బొమ్మ వ్యక్తి — నర్స్ — వాళ్ళ మధ్య పంజరం.

లత రక్కున పుస్తకం మూసేసి గుండెమీద చెయ్యి వేసుకుని, "నేను ఎవరూ చూడ్డం లేదుకదా ... అని అనుకున్నాను" అంది.

"ఎలా ఉంది?"

మళ్ళీ తీసి నింపాదిగా చూసి, "సింప్లీ గ్రేట్!" అని ఓ క్షణం ఆగి అతన్ని సూటిగా చూస్తూ చిలిపిగా అడిగింది: "ఇది నాకు ఇస్తారా ...?"

"ఇంతకంటే మంచిదే ఇస్తాను. ఇది అవుట్‌లైన్ మాత్రమే."

"మీరు చాలా గొప్ప ఆర్టిస్టల్లా..."

"నో, స్టూడెంటునే! ఆఁ ... అది ఇస్తే, నా కేమిస్తారు?"

సుమలత నిరంజన్‌వేపు చూస్తూ కళ్ళు టపటపలాడించింది. ఇంతసేపూ చొరవగా మాట్లాడుతున్నందుకు అతనిలో వచ్చిన తెగువకు తుళ్ళిపడింది.

అతని మన సెలాంటిదో కనుక్కోవడానికి గొప్ప చిట్కా అతనే సజెస్ట్ చేశాడు. ఇంకేం?

నింపాదిగా అంది. "మీరు ... ఏమడిగితే ... అది."

నిరంజన్ సూటిగా చూస్తూ అన్నాడు: "నిజం చెప్పండి. మీరు ఇంత ఉదయాన్నే జోస్యం చెప్పించుకోమని కలవర పెట్టిన సమస్య ఏమిటి?"

సుమలత ముఖం పాలిపోయింది. తలవంచుకునే అంది: "రాత్రి నాన్నకీ, అమ్మకీ గొడవ జరిగింది. నా పెళ్ళి విషయమై అనుకోండి. మరీ అంత పాత కాలప్పు అమ్మని నాన్న ఎలా భరిస్తున్నాడో అనిపిస్తుంది. అమ్మకి భయం. నాకీ ఉద్యోగం వచ్చిందే తడవు పెళ్ళి చెయ్యమని ఒకటే గోల. ఆయన వేం చేస్తాడు? వెతుకుతూనే ఉన్నాడు ...

అందుచేత నాన్న కోపంతో అన్నం తినలేదు. అందుకేనే నాకు కోపం. అలా తెల్లవారుతూనే బయటికి వెళ్ళాడు."

నిరంజన్ మనసులో ఏమిట్రా బాబూ అసలు విషయం చెప్పదేం, అనుకుంటూనే — "ఆఫ్ కోర్స్" అన్నాడు అనునయంగా. అంతలోనే ఓ అందమైన అమ్మాయితో మాట్లాడుతున్నానన్న గర్వం అతని నో గడుసు ప్రశ్న వేయించింది.

"ఇంతకీ ఆ చిలక వరుడెక్కడున్నాడో చెప్పిందా?"

లత సిగ్గుపడింది. "దాని బొంద..." అంటూ నొసలు చిట్లిస్తూ, దగ్గరవుతున్న సర్వరమ్మ చేతిలోని గొడుగును గుర్తు పడుతూ అంది.

"అరె! ఇంతవరకూ చెప్పనేలేదు. మీరు తెచ్చింది ఇదా! ఎటొచ్చీ తనకే మానర్స్ ఉండవు. మీచేత పంపక పోతే ఏం?" అంటూ గొడుగు అందుకుంటూ ... "థాంక్స్ ... అసలు నేను ఉద్యోగంలో చేరాక, అలా వెళ్ళడానికి వీల్లేదు అని ఒట్టేయించుకున్నాను. ఇదుగో, ఇలా కోపం వచ్చినప్పుడు చిలకా, తనూ తయారు. చెపితే వినడు... ఈ పంజరమే కదా నిన్నింత పెద్దదాన్ని చేసింది అంటాడు."

"ఎవరూ? !"

"మా నాన్నే ... ప్ప్ ... పాపం! రాత్రి మా గొడవల్లో మేముంటే అది ఆకలితో అల్లాడిపోతున్నా అరవలేదు." స్కెచ్‌లోని చిలకను జాలిగా చూస్తూ అంది సుమలత— "అందుకే నాన్న దీన్ని 'సుమతి' అంటాడు... సుమతికి ఈవేళ ఎలాగైనా ఓ ఆపిల్ తీసుకెళ్ళాలి ..." ★